క్లుప్తంగా

సంక్షేమానికి పట్టం కట్టాలి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: సంక్షేమానికి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, ఆ పార్టీ సీనియర్ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని 18వ వార్డులో వారు పర్యటించారు. పార్టీ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వార్డు కౌన్సిలర్ నాయుడు లక్ష్మీ సౌజన్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వార్డులో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, యువనేత పృథ్వీరాజ్ కూడా ఈ ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకుల బూటకపు మాటలు నమ్మితే మొన్న ఒకటో తారీఖున పింఛన్ల కోసం ఎండలో రచ్చబండల దగ్గర పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ఆయనను ప్రజలంతా గెలుపించుకోవాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్లు సవరపు సతీష్, మందపల్లి రవి, సీతామహాలక్ష్మి, గ్రంధి శ్రీను, నాయకులు యర్రగుంట అయ్యప్ప, కంది నాగ శ్రీదేవి, ప్రసాద్, దుగ్గిరాల గణేష్, దుగ్గిరాల రాంబాబు, దుగ్గిరాల నగేష్, కళ్యాణ్, దుగ్గిరాల పుల్లాజీ, పొట్టియ్య, అధికారి శ్రీను, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీను, సిద్ధిరెడ్డి రామకృష్ణ, లేగా వెంకన్న, తాడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

9న అర్తమూరు కనకదుర్గమ్మ తీర్థం



కనకదుర్గమ్మ వారు

మండపేట: మండలంలోని అర్తమూరులో కొలువైన శ్రీ కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం ఈ నెల 9న జరగనుంది. ఇందు కోసం ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్, ఆ పంచాయతీ ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) తెలిపారు. కనకదుర్గమ్మ తల్లి అర్తమూరు వాసుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటోంది. ఏటా కొత్త అమావాస్య రోజున అమ్మవారి జాతర, ఉగాది రోజున తీర్థ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 1977లో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు ఎక్కడున్నా ఆ రోజున వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

సమావేశాలకు అనుమతి తప్పనిసరి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమావేశాలు నిర్వహించుకునేవారు విధిగా అనుమతి తీసుకోవాలని అంగర ఎస్సై అందే పరదేశి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాల్లోనూ పోలీసు చట్టం సెక్షన్- 30 అమల్లో ఉందని, సీఆర్‌పీసీ సెక్షన్ 144లు అమలులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ కార్యక్రమాలు, ఆధ్యాత్మిక జాతరలు, ర్యాలీలకు సైతం రామచంద్రపురం డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో అనుమతులను పొందాలని ఎస్సై పరదేశి తెలిపారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

రాయవరం: భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని లొల్ల గ్రామంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పార్టీ నాయకులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, బీజేపీ నాయకులు చింతా తమ్మిరెడ్డి, రాయుడు శ్రీనివాస్, నిమ్మకాయల సాయి రామ్ ప్రసాద్, పిల్లా సురేష్, గరగ సతీష్, అబ్బిరెడ్డి శాంతారావు, కార్య కర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



రామచంద్రపురం: రామచంద్రపురంలో 33/11కేవీ టౌన్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ ఓదూరు ఫీడర్, 33/11కేవీ చోడవరం ఇండస్ట్రియల్ ఫీడర్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం, 132 కేవీ కాకినాడ, రామచంద్రపురం డీసీ పనుల నేడు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి జయానంద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నేడు రేపు (ఆదివారం, సోమవారం) చోడవరం నూకల మిల్లు, నరసాపురపుపేట, ఓదూరు పరిధిలోని ఆక్వా సర్వీసుల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్నబోతున్న ధనమ్మ మర్రి

- తగ్గుతున్న మర్రి ఊడల విస్తీర్ణం
- మానవ తాకిడి ప్రభావంతో నష్టం
- మర్రి చెట్టు మొదళ్ల వద్ద వంటావార్పుతో సమస్య
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న పర్యాటకులు



మర్రి చెట్టు మొదలులో ఉన్న ఇటుకల పొయ్యి, బూడిద

కపిలేశ్వరపురం: నిత్యం రోజువారీ కార్యకలాపాల ఒత్తిళ్ల మధ్య ఏమైనా కాస్త విరామం దక్కితే.. ఆ ఆనందమే వేరు. విరామ సమయం కొద్దిపాటిదే అయినా ఆటవిడుపుగా అది అందించే ఆనందం అంతా ఇంతా కాదు. విరామ సమయంలో ఆహ్లాదకరమైన వాతావరణంలోనో, ఆధ్యాత్మిక కార్యకలాపంతోనో జీవించాలని సహజంగా ఉంటుంది. అటు ఆహ్లాదం ఇటు ఆధ్యాత్మికం రెండూ కలబోసి విరబోసిన హరివిల్లే ధనమ్మ మర్రి. కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మ తల్లి ఆలయం పర్యాటకంగానూ, ఆధ్యాత్మికంగా విరాజిల్లుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. విస్తారమైన మర్రి ఊడలు ఆలయ ఆవరణ ప్రత్యేకత. రాను రానూ మర్రి ఊడలు విస్తీర్ణం తగ్గిపోవడం ఆందోళనకరంగా ఉంది.

ఇదీ ధనమ్మ మర్రి ప్రాశస్త్యం

తీవ్ర కరవు కాటకాలు ఉన్న రోజుల్లో సమీప గ్రామాల ప్రజలను ధనమ్మతల్లి ఆదుకోవడం, అమ్మవారి అక్కచెల్లెళ్లు మర్రి ఊడల నడుమ నడియాడారన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని ధనమ్మమర్రిగా పిలుస్తారు. సుమారు రెండున్నర ఎకరాల గోదావరి లంక భూమిలో అమ్మ వారి క్షేత్రం వెలసింది. సమీపాన గలగలపారే గౌతమి గోదావరి, చుట్టూరా ఉద్యాన పంటల సాగు, లంక వాసుల జీవనగమనం ఇలా ధనమ్మ మర్రికి అనేక ప్రత్యేకతలున్నాయి. వివాహం అయిన తొలిరోజు దంపతులు అమ్మవారిని దర్శించుకోవడం ఆచారం ఉంది. లంక గ్రామాల ప్రజలు తమ ఉద్యాన పంటల దిగుబడి కాలంలో తొలి పండు, గింజ, కాయ, పుష్పం తదితర ఉత్పత్తిని అమ్మవారికి సమర్పించుకుంటారు. వ్యాపార రంగంలోకి ప్రవేశించినవారు అమ్మ దర్శనాన్ని తీసుకొంటారు. మహిళలు కొనుక్కున్న బంగారు ఆభరణాన్ని అమ్మవారి మెడలో వేసి పూజలు చేసి తీసుకెళ్తుంటారు. బారసాల రోజున, పిల్లలకు పేర్లు పెట్టించుకునేందుకు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. సంతాన లేమిగల దంపతులు ఆలయ ప్రాంగణంలోని ఉయ్యాలను ఊపి, ముడుపులను మర్రి చెట్టుకు కట్టి సంతాన ప్రాప్తికై మొక్కుకుంటారు.

తరిగిపోతున్న మర్రి ఊడల విస్తీర్ణం

ఆది నుంచి నేటి వరకూ ప్రైవేట్ ఏలుబడిలో ధనమ్మ మర్రి నిర్వహణ కొనసాగుతోంది. ఆది, మంగళ, బుధవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఏర్పాట్లు చేయడం, తగిన సదుపాయాలను కల్పించడంలో కృషి సమర్థవంతంగా కొనసాగుతోంది. అయితే కాలం చెల్లడంతో కొన్ని మర్రి చెట్లు బురుగుపోయే దశకు చేరుకున్నాయి. క్షేత్రం ఆవరణలో మానవతాకిడి పెరగడంతో నేల గట్టిపడి మర్రి ఊడలు భూమిలోకి చొచ్చుకొనివెళ్లే పరిస్థితులు సన్నగిల్లుతున్నాయి. దీనికి తోడు దైవ క్షేత్రాన్ని దర్శించుకుంటున్న భక్తులు మర్రి ఊడల చెట్ల వద్ద నిప్పు రాజేసి వంట చేయడంతో చెట్టు మొదలు ప్రాంతంలోని బెరడు దెబ్బతింటోంది. ఈ పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగడంతో ఇప్పటికే మర్రి ఊడలు చాలా వరకూ తగ్గిపోయాయి. రెండున్నర ఎకరాల్లో మర్రి ఊడలతో దైవ క్షేత్రం గుబురుగా ఉండేదని పెద్దలు చెబుతున్నారు. అందుకే క్షేత్రాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారంటున్నారు. వంటా వార్పు చేసుకునేందుకు దైవ క్షేత్రం దూరంగా వంట షెడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది మర్రి మొదళ్ళ వద్ద నిప్పు పెడుతుండటంతో సమస్య తలెత్తుతుంది. ధనమ్మ మర్రి ప్రాధాన్యతను కాపాడుకునేందుకు మర్రి చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



సహజ సిద్ధంగా బులుగిపోయిన మర్రి చెట్టు

మండలంలో 99 శాతం పింఛన్ల పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ ఎం.కొండలరావు శనివారం తెలిపారు. ఏప్రిల్‌కు సంబంధించి 10,339 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం నాటికి 10,137 మందికి పంపిణీ చేయడంతో 99 శాతం నమోదైంది. మండలం మొత్తంలో రూ.2,99,69,500 విడుదల కాగా రూ.2,94,84,000 పంపిణీ చేశారు. అద్దంకివారిలంకలో 359కి 358 మందికి పంపిణీ చేశారు. మాచరలో 621కి 615, కేదారిలంకలో 481కి 476, టేకి 01లో 511కి 504, కపిలేశ్వరపురం 1 సచివాలయం పరిధిలో 576 కి 568 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. టేకి-2లో 497 కి 490, వడ్లమూరులో 487కి 480, కపిలేశ్వరపురం 2లో 525 కి 517, కోరుమిల్లి 02లో 308కి 303, నేలటూరులో 662కి 651, తాతపూడిలో 347కి 341, అంగర-1లో 658కి 545 కాలేరులో 653కి 640, వల్లూరులో 604కి 592 మందికి పింఛను సొమ్మును అందజేశారు. పై గ్రామాలన్నింటి లోనూ 99 శాతం పంపిణీని పూర్తి చేశారు. అంగర- 2 సచివాలయంలో 772 కి 752 మందికి, పడమర ఖండ్రికలో 519కి 505, నల్లూరులో 445 కి 433, మందికి పింఛను సొమ్ము అందజేశారు. ఆయా గ్రామాల్లో 98 శాతం పంపిణీని పూర్తి చేశారు.

కోరుమిల్లి-01 సచివాలయంలో 559కి 541 ఇవ్వగా 97 శాతం, వాకతిప్పలో 442కి 427 పంపిణీ చేయగా 96 శాతం, వెదురుమూడిలో 313కి 299 మందికి అందజేయడంతో 95 శాతం నమోదైనట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

విజృంభిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న కె.గంగవరం ప్రధాన రహదారి

కె.గంగవరం: ఈ నెల మొదటి వారం నుంచి ఎండలు విజృంభించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలో అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఇళ్లకే పరిమితి అవుతున్నారు. దీంతో పలు గ్రామాల్లో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ నెలలో ఎండలు విజృభించడంతో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. దీనికి తోడు వడగాల్పులతో ఎండ వేడికి పల్లే గ్రామాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. గోదావరిలోని నీరు లేకపోవడంతో గాల్పులతో గోదావరి తీర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎండ వేడికి ఆపసోపాలు పడుతున్నారు. ఎండతాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలపై ఆధార పడుతున్నారు. కూల్ డ్రింక్ షాపులు, శీతలపానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బొండాల వద్ద జనం బారులు తీరుతున్నారు.

ఆపదలో మీ ఆత్మీయుడిని

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కాపుల ఆత్మీయ కలయిక సభలో భరోసా
- ఘనంగా తోటకు సన్మానం



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న కాపు సంఘ ప్రతినిధులు

మండపేట: నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాల్లో ఉన్నపుడు తనను గుర్తుపెట్టుకోకపోయినా కష్టాల్లో ఉన్నపుడు మాత్రం తాను ఉన్నాననే సంగతి మరిచిపోవద్దని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలూ బాగుండాలని, అందులో కాపు సామాజిక వర్గం వారు కూడా ఉండాలన్నారు. కాపుల ఆత్మీయ కలయిక శుక్రవారం రాత్రి స్థానిక సంగిత వెంకటరెడ్డి నగర్లోని జొన్నల శేషాయమ్మ, అబ్బులు కాపు కల్యాణ మండపంలో భారీ ఎత్తున జరిగింది. కాపు అభ్యుదయ సంఘం ప్రెసిడెంట్ జిన్నూరి సత్యసాయిబాబా సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి తోట తనయుడు పృథ్వీరాజ్‌తో పాటు నియోజకవర్గంలోని కాపు ప్రముఖులు, పట్టణంలోని కాపు సంఘీయులు, యువత, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలి వచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తోట తన ప్రసంగంలో కాపు యువత చెడు వ్యసనాలు లోను కావద్దన్నారు. కాపు సంఘం అనేది ఎవరికీ వ్యతిరేకంగా పని చేయరాదని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల వారితోనూ కలసి మెలిసి జీవించాలన్నారు. ఇతర సామాజిక వర్గాల వారికి ఏదైనా కష్టం వస్తే కాపులను ఆశ్రయిస్తే రక్షణ లభిస్తుందనే నమ్మకాన్ని కలిగించేలా మన ప్రవర్తన ఉండాలన్నారు. కాపు సంఘీయులంతా ఐకమత్యంతో మెలగాలని సూచించారు. పేదరికంలో ఉన్న కాపులను ఆదుకునేలా, ముఖ్యంగా పేద పిల్లలను చదివించేందుకు సంఘం కృషి చేయాలన్నారు. సమాజంలోని వారంతా బాగుండాలని అందులో మన జాతి కూడా ఉండాలని ఆకాంక్షించాలన్నారు. సమాజంలో కాపులు మరింత అభివద్ధి చెందేలా కార్యాచరణ ఉండాలన్నారు.

మండపేటలోనే నివాసం

తాను మండపేటలోనే ఇల్లు కట్టుకుని ఇక్కడే నివాసం ఉంటానని ఎమ్మెల్సీ తోట ప్రకటించారు. ఈ నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ, ఎవరు సమస్యల్లో ఉన్నా సాయం కోసం తన వద్దకు రావచ్చన్నారు. ఈ కల్యాణ మండపానికి రోడ్డు వేయించడం తన బాధ్యతని అన్నారు. సమాజంలో ఏ ఒక్క కులం వారు ఓట్లు వేస్తేనో ఎన్నికల్లో గెలవరని అన్ని వర్గాల వారు ఆదరిస్తేనే విజయం సాధిస్తారన్నారు. అనంతరం జిన్నూరి సాయిబాబా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఘనంగా సన్మానించారు. సిరంగు శ్రీనివాస్, ముక్కా సుబ్రహ్మణ్యం, యాళ్ల శ్రీనివాస్, పేపర్తి సాంబు, దూలం చక్రవర్తి, సిద్ది రెడ్డి సూర్యారావు, గోకరకొండ భీమరాజు, మెండు బాపిరాజు, ఉంగరాల రాంబాబు, అధికారి శ్రీనివాస్ తదితరులు ఆయనను పూలమాలలు దుశ్శాలువాలతో ముంచెత్తారు. అంతకు ముందు కాపు ప్రముఖులు పుట్టపూడి అబ్బు, ఉండమట్ల శ్రీనివాస్, పడాల సతీష్, జొన్నపల్లి సూర్యారావు, అధికారి శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో వాదా ప్రసాదరావు, సాధనాల చక్రపాణి, మచ్చా నాగబాబు, ఆదిమూలం అబ్బులు నాయుడు, టపా వీర గోవిందరావు పాల్గొన్నారు.

కాపు ప్రజాప్రతినిధులకు సత్కారం

గత మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాపు కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా వారందరినీ పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందిందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పలువురు కౌన్సిలర్లు, కపిలేశ్వరపురం జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మండపేట ఎంపీపీ సభ్యుడు వుండమట్ల శ్రీనివాస్ తదితరులు సన్మాన గ్రహీతల్లో ఉన్నారు.

టీడీపీలో దళితులకు ప్రాధాన్యం లేదు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్


కాజులూరు: టీడీపీలో దళితుల మనోభావాలకు అసలు ప్రాధాన్యం లేదని అందుకే దళిత ద్వేషి అయిన వాసంశెట్టి సుభాష్‌కు రామచంద్రపురం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని ఆ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్, కుయ్యేరు మాజీ సర్పంచ్ పోతుల మాధవ అన్నారు. శనివారం గ్రామంలో పోతుల మాధవ టిడిపీకి, పార్టీలోని తన పదవికి రాజీనామా చేసి సుమారు 100 మంది కార్యకర్తలతో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోతుల మాదవ మాట్లాడుతూ జిల్లాల విభజనలో కొత్తగా ఏర్పడిన కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంపై తీవ్రంగా వ్యతిరేకించిన వాసంశెట్టి సుభాష్‌కు టీడీపీ టికెట్ కేటాయించటపై దళితులుంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. స్థానికేతరులకు పార్టీ టికెట్ ఇవ్వొద్దని, ఇస్తే తామంతా రాజీనామా చేస్తామని ప్రకటించినా వారు తమ మాట వినలేదని అన్నారు. జగనన్న ప్రభుత్వం దళితులపై ఎంతో ఆదరాభిమానాలు చూపిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎంతో మంది టీడీపీ దళిత నాయకులు నిరుత్సాహంతో ఉన్నారని వారందరిని సంప్రదించి భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బందనపూడిలో పలువురి చేరిక

మండలంలోని బందనపూడిలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక నాయకులు డేగల నాగేంద్ర, మోకన శ్రీను ఆధ్వర్యంలో సుమారు 50 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. జగనన్న పథకాలతో రాష్ట్రంలోని పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పనితీరుకు ఆకర్షితులై పార్టీలో చేరామని కొత్తగా చేరిన కార్యకర్తలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు.

రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే గెలుపు

ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



బందనపూడిలో వైఎస్సార్ సీపీ రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న స్థానికులు

కాజులూరు: రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీ మరోసారి గెలుపొందడం ఖాయమని రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని బందనపూడిలో గ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి సత్యనారాయణ ఆధ్వర్యంలో సూర్యప్రకాష్ తదితర నాయకులు ఇంటింటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు సూర్యప్రకాష్ తదితరులను గజమాలతో సత్కరించగా, మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ పేదవాడు కూడు, గూడు, నీడలకు లోటు లేకుండా హాయిగా బతకాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం కావాలన్నారు. ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్ మంచి, మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. గతంలో ప్రతి చిన్న పనికి జిల్లా కలెక్టరేట్, మండల పరిషత్ తదితర కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను స్థానికంగానే అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గతంలో అర్హులకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసులు ఉండాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీల రూపంలో ఉన్న దళారులు ముడుపులు తీసుకుని వారికి నచ్చిన వారికే పథకాలు ఎంపిక చేసేవారన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే రాష్ట్రానికి జగనే మరలా సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, పార్టీ నాయకులు డేగల నాగేంద్ర, మోకన శ్రీను, జి.రాజేంద్రప్రసాద్, తలాటం బాబులు, వంగా రంగా, ఎస్ ఈశ్వర్‌రెడ్డి, సత్తి శ్రీరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మంగారాణి

రామచంద్రపురం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. ఓ పక్కన ప్రచారంలో పాల్గొంటూనే కార్యకర్తలు, నేతల సహకారంతో పార్టీలోకి వస్తున్న వివిధ పార్టీల నేతల వద్దకు వెళ్లి ఆశీర్వదించాలని కోరుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ మేలును వివరిస్తూ జరగబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. ఇదిలా ఉండగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లలో చేసిన పాలన, సంక్షేమాన్ని చూసి టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. అందులో భాగంగా పట్టణంలోని ముగ్గురు మాజీ టీడీపీ కౌన్సిలర్లు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు మాజీ టీడీపీ కౌన్సిలర్ పలివెల సీతామహాలక్ష్మి, భర్త జగదీష్, 18వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ మెండు నాగమణి, భర్త రాము, 3వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ మామిడి మంగారాణి, భర్త లక్ష్మీనారాయణలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పార్టీ కండువాలను వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు పెంటపాటిదేవి, పోతంశెట్టి వెంకట శ్యామల, జేకే పాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, పార్టీ నేతలు పిట్టా నాని, కొప్పిశెట్టి శ్రీను, శాఖా బాబి, అనిశెట్టి సత్తిబాబు, గుంటముక్కల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ సీఎస్



తెలంగాణ సీఎస్ శాంతి కుమారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఎ.శాంతికుమారి దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది మండపంలో ఆమెకు పండితుల వేదాశీర్వచనం చేశారు. ఈఓ తారకేశ్వరరావు స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు. ఆమె వెంట రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు

మండపేటలో ఆరు బైక్‌ల స్వాధీనం



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

మండపేట: వ్యసనాలకు బానిసలై సొమ్ము కోసం మోటార్ సైకిళ్లు అపహరించే ముఠాను మండపేట టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై హరి కోటిశాస్త్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండపేట పట్టణంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించిన ముగ్గురిని టౌన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇటీవల జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగతనాలు ఎక్కువ కావడంతో దోషులను పట్టుకునేందుకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట టౌన్ సీఐ అఖిల్ జమ, ఎస్సై హరికోటి శాస్త్రి, కానిస్టేబుళ్లు సతీష్, రమేష్‌లతో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం మోటార్ సైకిళ్ల దొంగతనాల నిందితుల కోసం రెండు రోజులుగా గాలింపు చేపట్టింది. ఈ నేపథ్యంలో శనివారం మండపేట బైపాస్ రోడ్డులోని సంఘం కాలనీ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి ఈ కేసులోని ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారు గోకవరం మండలం మొల్లేటి మల్లవరం గ్రామానికి చెందిన ముచ్చకర్ల ప్రసాద్, అదే గ్రామానికి చెందిన బురుకట్ట కాటస్వాములు, మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన మొక్క అప్పారావు. చెడు వ్యవనాలకు బానిసలైన ఈ ముగ్గురూ తమ అవసరాల కోసం ఒక ముఠాగా ఏర్పడి జగ్గంపేట, ఏలేశ్వరం, మండపేట టౌన్, పెద్దాపురాల్లో ఒక్కో వాహనాన్ని, వైజాగ్‌లో రెండు వాహనాలను కాజేశారు. ఆ ఆరు మోటార్ సైకిళ్ల మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీ టిడ్కో అపార్ట్‌మెంట్ల వెనుక భాగంలో దాచారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. ఐదు లక్షల వరకూ ఉంటుందని ఎస్సై తెలిపారు. నిందితులను ఆలమూరు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, న్యాయమూర్తి ఈ నెల 12 వరకూ రిమాండ్ విధించారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.